
AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ నిజామాబాద్ నగరాధ్యక్షుడిగా బొబ్బిలి రామకృష్ణ ఇటీవల పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయాలపై వారిరువురు చర్చించారు. నగరంలో కాంగ్రెస్ పురోభివృద్ధికి మరింత కృషి చేయాలని బల్మూరి వెంకట్ బొబ్బిలి రామకృష్ణకు సూచించారు.





సదాశివనగర్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు




ఎడపల్లి మండలంలో..





పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడత పోరు ముగిసింది. ఉమ్మడి జిల్లాలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తలేదు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ముగియగా.. క్యూలైన్లలో ఉన్నవారికి ఓటింగ్‌కు అవకాశం ఇచ్చారు. మధ్యాహ్నం 2 గంటల త్వరాత కౌంటింగ్ ప్రారంభించారు. విజేతలను ప్రకటించిన అనంతరం ఉప సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. - అక్షరటుడే, ఇందూరు, కామారెడ్డి

# ముగిసిన తొలిపోరు

- పల్లెల్లో ప్రశాంతంగా పోలింగ్
- నిజామాబాద్ జిల్లాలో 81.37 శాతం ఓటింగ్
- కామారెడ్డి జిల్లాలో 79.40 శాతం

నిజామాబాద్ జిల్లాలోని 11 మండలాల్లో జిల్లాలోని బోధన్ డివిజన్‌లో గల 11 మండలాల్లో 184 సర్పంచ్ స్థానాలకు, 1,642 వార్డు స్థానాలకు ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 29 సర్పంచ్, 575 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో గురువారం 155 సర్పంచ్, 1,060 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఆయా మండలాల్లో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురుకాకుండా జిల్లా ఎన్నికల అధికారి వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య పర్యవేక్షించారు. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు తగు సూచనలు చేశారు. సాలూరు మండలం జాడిజమాల్‌పూర్ ఓ వృద్ధుడు అనారోగ్యంతో ఉన్నా.. అంబులెన్స్‌లో వచ్చి ఓటేసి ఆదర్శంగా నిలిచాడు.

### 81.37 శాతం పోలింగ్..

తొలి విడత ఎన్నికలు ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై.. ఒంటి గంట వరకు సాగింది. ఉదయం చలి నేపథ్యంలో ఓటింగ్ కాస్త మందకోడిగా సాగినా.. 8 గంటల తర్వాత పుంజుకుంది. నిజామాబాద్ జిల్లాలో తొలి రెండు గంటల్లో (ఉదయం 9 గంటల వరకు) 19.80 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే ఉదయం 11 గంటల వరకు 50.73 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ముగిసే సమయానికి ఒంటి గంట వరకు 78.83 శాతం ఓట్లు పోలయ్యాయి. అయితే క్యూ లైన్లలో ఓటర్లు ఉండడంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగింది. చివరకు 81.37 శాతంగా నమోదైంది. అత్యధికంగా సాలూర మండలంలో 86.45 శాతం, అత్యల్పంగా నవీపేట మండలంలో 76.95 శాతంగా నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం ఓట్లు 2,42,723 ఉండగా.. 1,97,492 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మహిళలు 1,05,282, పురుషులు, 92,210 మంది ఓట్లు వేశారు.

## మండలాల వారీగా ఓటింగ్ శాతం..

**నిజామాబాద్ జిల్లా**

| | |
|---|---|
| సాలూర | 86.45 |
| బోధన్ | 84.93 |
| రుద్రూర్ | 83.85 |
| చందూర్ | 79.55 |
| కోటగిరి | 78.21 |
| మోస్రా | 82.48 |
| పోతంగల్ | 82.30 |
| రెంజల్ | 83.72 |
| వర్ని | 80.83 |
| ఎడపల్లి | 79.92 |
| నవీపేట | 76.95 |

**కామారెడ్డి జిల్లా**

| | |
|---|---|
| భిక్కనూరు | 81.05 |
| బీబీపేటలో | 83.65 |
| దోమకొండ | 75.62 |
| కామారెడ్డి | 78.45 |
| మాచారెడ్డి | 78.19 |
| పాల్వంచ | 81.09 |
| రాజంపేట | 80.46 |
| రామారెడ్డి | 75.26 |
| సదాశివనగర్ | 78.81 |
| తాడ్వాయి | 80.63 |

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలోని 10 మండలాల్లో 156 సర్పంచ్, 1,456 వార్డు స్థానాలకు మొదటి విడత ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 167 సర్పంచ్ స్థానాలు, 1520 వార్డు స్థానాలకు ఓటింగ్ జరగాల్సి ఉండగా 10 గ్రామాల్లో పూర్తిస్థాయి పాలకవర్గాలు, ఒక గ్రామంలో సర్పంచ్ స్థానం, 433 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 2,42,913 మంది ఓటర్లకు గాను 1,92,870 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల వరకు 19.70 శాతం ఓటింగ్ నమోదు కాగా.. కేవలం 47,850 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు 53.31 శాతం ఓటింగ్ నమోదైంది. 11 గంటల వరకు 1,29,493 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 79.40 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 2,42,913 మంది ఓటర్లలో 1,92,870 ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకే ఓటింగ్ జరగాల్సి ఉన్నా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉండడంతో దాదాపు మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగింది. అనంతరం కౌంటింగ్ ప్రారంభించారు. కౌంటింగ్ అనంతరం ఉపసర్పంచ్‌లను ఎన్నుకున్నారు.

### గజ్యానాయక్ తండాలో స్వల్ప ఘర్షణ

మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండాలో స్వల్పంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేస్తున్నారని పుకార్లు వ్యాపించాయి. దుబాయ్‌కి వెళ్లిన ఓ వ్యక్తి ఓటును ఇతరులు వేస్తున్నారని ప్రచారం కాగా.. స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు అక్కడ ఉన్నవారిని చెదరగొట్టారు. అయితే దుబాయ్ వెళ్లాడని పుకార్లు వచ్చిన సదరు వ్యక్తి వచ్చి తాను ఎక్కడికి వెళ్లలేదని.. తన ఓటు తానే వినియోగించుకున్నానని చెప్పడంతో వివాదం సర్దుమణిగింది.

## కామారెడ్డిలో రోడ్ల విస్తరణకు నిధులివ్వండి..



**అక్షరటుడే, కామారెడ్డి :** రెండు రోజులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఢిల్లీలోనే మకాం వేశారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పలువురు కేంద్రమంత్రులను వరుసగా కలిసి విన్నవిస్తున్నారు. గురువారం కేంద్ర మంత్రతి నితిన్ గడ్కరీని కలిశారు. కామారెడ్డి పట్టణ రింగ్ రోడ్డు, నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. కామారెడ్డి ఔటర్ రింగు రోడ్డు విస్తరణ వివరాలను కేంద్ర మంత్రికి వివరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి 54 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. నాడు ప్రతిపాదించిన పనుల కోసం సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ స్టేజీ నుంచి మెడికల్ కళాశాల, మైనారిటీ ఉమెన్ కళాశాల మీదగా జాతీయ రహదారి వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ కోసం రూ.40 కోట్లు ఇవ్వాలని విన్నవించారు. భిక్కనూరు నుంచి తిప్పాపూర్, తలమడ్ల గ్రామాల మీదుగా రాజంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.18 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కామారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి హైవే వరకు రోడ్డు విస్తరణ కోసం రూ.8 కోట్లు, పాల్వంచ మర్రి నుంచి మందాపూర్ మీదుగా భిక్కనూరు వరకు డబుల్ రోడ్డు విస్తరణ కోసం రూ.24 కోట్లు విడుదల చేయాలని విన్నవించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు.



## విశాల్ పిల్లల మనోవికాస కేంద్రాన్ని ప్రారంభించిన సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఖలీల్‌వాడిలో డాక్టర్ విశాల్ పిల్లల మనోవికాస కేంద్రాన్ని సీపీ సాయిచైతన్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి రోజుల్లో టెక్నాలజీ కారణంగా చిన్నారుల్లో బుద్ధిమాంద్యం ఏర్పడుతోందని.. ఆలోచన సరళి మారుతోందన్నారు. దీంతో పిల్లల్లో అనేక సమస్యలు వస్తున్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ మనోవికాస కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం సీపీ సాయిచైతన్యను డాక్టర్ విశాల్ సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ టీ జీవన్ రావు, డాక్టర్ వై శ్రీధర్ రాజు, డాక్టర్ వి జార్జి రెడ్డి, డాక్టర్ అజ్జ శ్రీనివాస్, డాక్టర్ హరీష్ స్వామి, డాక్టర్ రమేణేశ్వర్, డాక్టర్ కప్పల రాజేష్, అడ్వకేట్ ఆర్ జగదీశ్వరరావు, ఎం సిద్దయ్య, డాక్టర్ కె రాజేష్, డాక్టర్ పి.బి.కృష్ణమూర్తి, డాక్టర్ కౌలయ్య తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ విశాల్ సతీమణి డాక్టర్ నాగ పద్మ, ప్రముఖ వైద్యులు, ఆయా సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఎంపీని కలిసిన ఎమ్మెల్యేలు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఢిల్లీలో ఎంపీ అర్వింద్ ధర్మపురిని నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్ రెడ్డి కలిశారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతున్న ఎంపీని గురువారం వారిరువురు పార్లమెంట్ ఆవరణలో కలిసి మాట్లాడారు. అనంతరం ఎంపీతో కలిసి పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. తమ నియోజకవర్గాల అభివృద్ధి పనులపై చర్చించారు.

## గోకుల్ తండాలో ఎన్నికల బహిష్కరణ..



**అక్షరటుడే, కామారెడ్డి:** మొదటి విడత ఎన్నికల సమయంలో ఓ తండా వాసులు ఎన్నికలను బహిష్కరించారు. స్వయంగా ఆర్డీవో వెళ్లి సముదాయించినా వినిపించుకోకపోవడంతో అక్కడ ఎన్నిక జరగలేదు. రామారెడ్డి మండలం గోకుల్ తండాలో మీది తండా, కింది తండా ఉంటాయి. గతంలో ఈ తండాలో మొదటిసారి ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో మీదితండా వాసి సర్పంచ్ అయ్యారు. మీది తండాలో 350 ఓటర్లు ఉండగా 5 వార్డులు ఉన్నాయి. కింది తండాలో 250 ఓటర్లు ఉండగా 3 వార్డులు ఉన్నాయి. అయితే తమ తండాను ప్రత్యేక పంచాయతీగా మారిస్తేనే ఓటు వేస్తామని తండావాసులు భీష్మించుకు కూర్చున్నారు. జీపీగా చేయకపోతే ఎన్నికలు బహిష్కరించామని పేర్కొన్నారు. కామారెడ్డి ఆర్డీవో వీణ తండాకు వెళ్లి ఓటర్లను ఒప్పించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఎన్నికలు బహిష్కరించినా జీపీ ఏర్పాటు ఇప్పటికిప్పుడు జరగదని.. వెంటనే ప్రతి ఒక్కరు ఓటు వేయాలని కోరారు. అయినా తండావాసులు ఎన్నికలను బహిష్కరించారు.

## విజేతల సంబరాలు..

ఉమ్మడి జిల్లాలో తొలివిడత ఎన్నికల సంగ్రామం గురువారం ప్రశాంతంగా ముగిసింది. అనంతరం సాయంత్రం ఫలితాలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా గెలుపొందిన అభ్యర్థులు సంబురాలు చేసుకున్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



బోధన్ మండలం మినార్‌పల్లి సర్పంచ్ పద్మ



జాడి జమాల్‌పూర్ సర్పంచ్‌గా గోగినేని జ్యోతి




సాలూర మండలం హున్సా సర్పంచ్‌గా మర్కల్ శివకుమార్



సాలూర మండలం కొప్పర్తి గ్రామంలో సతీష్



చందూర్ మండలం మేడిపల్లి తండా లకావత్ శ్రావణి



వర్ని మండలం పైడిమల్ సర్పంచ్‌గా అనూష చిరంజీవి



వర్ని మండలం జలాల్‌పూర్ సర్పంచ్‌గా నరెడ్ల మమత బాలు



వర్ని మండలం కూనిపూర్ సర్పంచ్‌గా బోయిని లక్ష్మణ్


ఎంఎస్‌సీ ఫారంలో పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి


సదాశివనగర్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర


బోధన్ డివిజన్‌లో బందోబస్తును పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య


బోధన్ మండలం సంఘం గ్రామంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో



# ముగిసిన తొలివిడత సంగ్రామం..

ఉమ్మడిజిల్లాలో తొలివిడత సంగ్రామం ప్రశాంతంగా ముగిసింది. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్, కామారెడ్డి జిల్లాలోని పది మండలాల్లో పోలింగ్ జరిగింది. అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. నిజామాబాద్ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్






పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు


గర్గుల్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న పోలీసులు


బోధన్‌లోని పోలింగ్ కేంద్రంలో క్యూలో మహిళలు



బోధన్‌లోని పోలింగ్ కేంద్రంలో హెల్ప్ డెస్క్


సాలూరలో పరిశీలిస్తున్న అబ్జర్వర్

## విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులు కంటిచూపుపై శ్రద్ధ పెట్టాలని కంటివైద్య నిపుణుడు హరికిషన్ అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, వసతి గృహం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 19 మందికి కంటిఅద్దాలు, 8 మంది విద్యార్థులకు శస్త్ర చికిత్సల నిమిత్తం బాన్సువాడ లయన్స్ క్లబ్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీంద్ర, శ్రీనివాస్, శ్రవణ్, వార్డెన్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



## అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలం కేంద్రంలోని రైతువేదికలో గురువారం సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల ఖర్చుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల ఖర్చు పరిశీలకుడు శివప్రసాద్, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రాజ శ్రీనివాస్, ఎంపీవో, ఎంఈవో, వివిధ పంచాయతీ కార్యదర్శులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సావర్‌గావ్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** జుక్కల్ మండలంలోని సావర్‌గావ్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఇటీవల సావర్‌గావ్‌కు చెందిన పాఠశాల విద్యార్థులు ఖండేబల్లూరు ప్రభుత్వ పాఠశాలకు ఆటోలో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారన్నారు. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడని వారు పేర్కొన్నారు. సావర్‌గావ్, విఠల్‌వాడి, బాబుల్‌గావ్, కరంజి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, విక్రమ్, సురేష్ పాల్గొన్నారు.

## జాడి జమాల్‌పూర్‌లో స్వల్ప ఉద్రిక్తత



**అక్షరటుడే, బోధన్:** సాలూర మండలం జాడి జమాల్‌పూర్ గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కౌంటింగ్ అనంతరం గెలిచిన అభ్యర్థి, ఆయన మద్దతుదారులు సంబురాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో హంగామా జరగడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో గెలిచిన అభ్యర్థి మద్దతుదారులు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. దీంతో సమాచారం అందుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గొడవను సద్దుమణిగేలా చూశారు.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద వసతుల కల్పన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డిలో రెండో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సిబ్బందికి వసతులు కల్పించారు. కళాశాలలో ఎన్నికల సామాగ్రిని ఏర్పాటు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు గాను ఇదివరకే ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 26 గ్రామపంచాయతీలకు అలాగే 246 వార్డు సభ్యుల సాధారణ ఎన్నికల కోసం వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తహేరా బేగం తెలిపారు. అలాగే గురువారం వరకు 28 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లుగా ఆమె తెలిపారు.




## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు గడ్డం మానస




**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం నెమలి గ్రామానికి చెందిన గడ్డం మానస జాతీయ స్థాయి యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. తమిళనాడులోని చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా ఈనెల 14 నుంచి 18 వరకు జరగనున్న వాలీబాల్ పోటీలలో ఆమె పాల్గొననుంది. ప్రస్తుతం మానస బాన్సువాడలోని ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమె ప్రతిభను గుర్తించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, నెమలి గ్రామ ప్రజలు మానసను అభినందించారు. గ్రామానికి, కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా మరిన్ని విజయాలు సాధించాలని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## బీడీ కంపెనీ ఎదుట కార్మికుల ధర్నా




**అక్షరటుడే, ఆర్మూర్ :** బీడీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్మూర్ పట్టణంలోని మోడ్రన్ బీడీ కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సూర్య శివాజీ మాట్లాడుతూ.. కంపెనీ యజమాన్యం కార్మికుల అమాయకత్వాన్ని నిరాక్షరాస్యతను ఆసరా చేసుకుని కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. అదేవిధంగా లేబర్ అధికారులకు కంపెనీపై ఫిర్యాదు చేసి మూడు నెలలు గడుస్తున్నా యజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా కంపెనీ యజమాన్యం తమ మొండి వైఖరి వీడి రాజీనామా చేసిన కార్మికులకు గ్రాట్యూటీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు సమీరా, లక్ష్మీనర్సు, అరటి అనిత, అరస లక్ష్మి, బయ్యా అనూష, వేల్పూర్ చంద్రబాగ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ విశిష్ట యజ్ఞ మహోత్సవం



**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని అంకాపూర్ వైదిక ధ్యాన యోగా కేంద్రంలో మూడో రోజు భగవద్గీత పారాయణం, మృత్యుంజయ విశిష్ట మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజ్యులు శ్రీధరానంద భారతి స్వామి, వైదిక పురోహితులు వేద పునీతానంద స్వామీజీలు భగవద్గీతలో మూడో అధ్యాయాన్ని చదివి భక్తులకు వినిపించారు. యజ్ఞ కార్యక్రమ అనంతరం స్వామి ప్రవచనం, యజ్ఞం వైశిష్ట్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అంకాపూర్, నిజామాబాద్, ఆర్మూర్, భీమ్‌గల్ తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ట్రాఫిక్ సిబ్బంది

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని ఖలీల్‌వాడిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మాక్లూర్ మండలం జ్యోతినగర్‌కు చెందిన సుజాత వైద్యం నిమిత్తం నిజామాబాద్ నగరానికి వచ్చింది. ఈ క్రమంలో ఖలీల్‌వాడిలో ఆమె తన వద్ద ఉన్న రూ.2వేలను పోగొట్టుకుంది. అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు చిన్నోళ్ల ఉదయ్, గోపాల్‌లకు ఆ డబ్బులు కనిపించగా వాటిని జాగ్రత్తగా ఉంచారు. బాధితురాలు సుజాత తిరిగి ఆ ప్రాంతంలో డబ్బుల కోసం వెతుక్కుంటూ రాగా.. ఆమెను గుర్తించి డబ్బులను తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కానిస్టేబుళ్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిజాయితీగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు ఉదయ్, గోపాల్‌లను ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అభినందించారు.



## అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని ఎస్సై మహేశ్ పేర్కొన్నారు. మండలంలోని కళ్యాణి, తిమ్మారెడ్డి, అన్నాసాగర్ గ్రామ ఓటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థులు, ఓటర్లు నడుచుకోవాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, ఇతర వర్గాలను కించపర్చేలా వ్యాఖ్యలు చేయవద్దని.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. 12వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో సెల్‌ఫోన్లకు అనుమతి ఉండదని చెప్పారు.

